క్లుప్తంగా

108లో ప్రసవం


శిశువును అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

దహెగాం: మండలంలోని ఐనం గ్రామానికి చెందిన గర్భిణీ దుర్గం అరుణ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. వివరాల్లోకి వెళ్తే.. అరుణకు ఇంటి వద్ద పురిటినొప్పులు రాగా కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్సులో దహెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి అంబులెన్సులో బెల్లంపల్లికి తరలిస్తున్న క్రమంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో కన్నెపల్లి మండలం మాడవెల్లి సమీపంలో ఈఎంటీ సుధాకర్, పైలట్ కిష్టయ్యలు డెలివరీ చేశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

‘ఉత్తమ’ అవార్డులు


ప్రశంసా పత్రం అందుకుంటున్న ప్రేంసింగ్

కెరమెరి: 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు అవార్డులు అందుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో కెరమెరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రేంసింగ్ ఉత్తమ కానిస్టేబుల్‌గా ఎస్పీ సురేశ్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

పెసా మొబలైజర్ భరత్ భూషణ్‌కు..


అవార్డు అందుకుంటున్న భరత్ భూషణ్

కెరమెరి మండలంలోని ధనోరా గ్రామానికి చెందిన మడావి భరత్ భూషణ్ ఉత్తమ పెసా మొబలైజర్‌గా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా ఊట్నూర్‌లో అవార్డు అందుకున్నారు. గిరిజన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో పాటు పోడు పట్టాలపై అవగాహన కల్పించినందుకు అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేతో అసోసియేషన్ సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కాగజ్‌నగర్ ఫొటో, వీడియో అసోసియేషన్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రపంచ ఫొటో దినోత్సవం సందర్భంగా ఈనెల 19న ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

యువత క్రీడల్లో రాణించాలి


బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.12 (రాంనగర్) గ్రామంలో స్వామి వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌లో విజేతలకు మంగళవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బహుమతులు అందజేశారు. ఈజ్‌గాం మార్కెట్ జట్టుకు మొదటి బహుమతిగా రూ.41 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన గుండపల్లి జట్టుకు రూ. 21,016, మూడో స్థానంలో నిలిచిన విలేజ్ నెం.13 జట్టుకు రూ. 11,013 అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో యువత రాణించాలన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎంపీటీసీ అమిత్‌దాస్, రాకేశ్ మిస్త్రి, సపన్‌మండల్, రతిన్‌మండల్, అమిత్‌సర్కార్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం : జైలర్

కాగజ్‌నగర్

వెంకటరమణ : జైలర్

\- ఆసిఫాబాద్‌అర్బన్


కాగజ్‌నగర్‌టౌన్: జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప


కాగజ్‌నగర్‌టౌన్: జెండా వందనం చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్


కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ కార్యాలయంలో..


ఆసిఫాబాద్‌రూరల్: జెండా వందనం చేస్తున్న డీఐఈవో

స్వేచ్ఛా సంబరాలు..!


ఆసిఫాబాద్: కాగజ్‌నగర్‌లో జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ శంకర్

జిల్లా వ్యాప్తంగా 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీచౌక్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మున్సిపల్ కార్యాలయంలో బల్దియా వైస్‌చైర్మన్ గిరీష్ కుమార్, బీఎస్పీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, నవోదయ విద్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ హరీశ్‌బాబు, సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ఉమామహేశ్వరి, జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో డీఈవో అశోక్, డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో శ్రీధర్ సుమన్, జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ (శాటిలైట్) కార్యాలయంలో మేనేజర్ సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలో 160 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో యువత ర్యాలీ నిర్వహించారు.

\- సాక్షి నెట్‌వర్క్


పెంచికల్‌పేట్: జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ సరిత


బెజ్జూర్: జెండా ఎగురవేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మేశ్వర రావు


దహెగాం: జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ సులోచన


చింతలమానెపల్లి: జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్


కాగజ్‌నగర్‌టౌన్: వేడుకల్లో పాల్గొన్న హరీశ్‌బాబు


కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు


ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడలో..


సిర్పూర్(టి): జెండా ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ఉమా మహేశ్వరి


కెరమెరి: జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ జమీర్


ఆసిఫాబాద్‌రూరల్: డీఈవో కార్యాలయంలో..


తిర్యాణి: జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ శ్రీదేవి


కౌటాల: ఎంపీడీవో కార్యాలయంలో..


ఆసిఫాబాద్‌అర్బన్: బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో..


ఆసిఫాబాద్‌అర్బన్: ఎల్ఐసీ కార్యాలయంలో..


ఆసిఫాబాద్: జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న యువత

ఏన్నాళ్లో వేచిన కొలువు..!

- శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా వీఆర్ఏలు
- పలు శాఖల్లో పోస్టింగ్
- జిల్లాలో విధుల్లో చేరిన 301 మంది

కౌటాల: ఏళ్లుగా చాలీచాలనీ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల శాశ్వత ప్రభుత్వ కొలువు కల ఎట్టకేలకు నెరవేరింది. జిల్లాలో పని చేస్తున్న వీఆర్ఏలకు వివిధ శాఖలు కేటాయించారు. ఇందులో భాగంగా ఇటీవల పోస్టింగ్‌లు ఇవ్వగా ఆయా కార్యాలయాల్లో విధుల్లో చేరారు. జిల్లాలో 301 మందికి సీసీఎల్ఏ నుంచే నేరుగా శాఖలు కేటాయించడంతో వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీరిలో నిజామాబాద్ నుంచి 17 మంది, భూపాలపల్లి నుంచి 32 మంది రాగా, 252 మంది జిల్లాకు చెందినవారు ఉన్నారు.

వీఆర్ఏల వ్యవస్థ రద్దు

రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏల సర్వీసును క్రమబద్ధీకరిస్తూ వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తూ జీవో నంబర్ 81ను విడుదల చేసింది. విద్యార్హతలను బట్టి జూనియర్ అసిస్టెంటు, రికార్డు అసిస్టెంటు, ఆఫీసు సబార్డినేట్, దిగువ స్థాయి గ్రేడు కలిగిన కేటగిరి ఉద్యోగాలకు ఎంపిక చేసింది. డిగ్రీ, పీజీ అర్హతలు ఉన్న వారిని జూనియర్ అసిస్టెంట్లుగా, పదో తరగతి, ఇంటర్ అర్హత ఉంటే రికార్డు అసిస్టెంటుగా, తొమ్మిదో తరగతి అంతకంటే తక్కువ ఉంటే ఆఫీసు సబార్డినేట్, నిరక్షరాస్యులను లాస్ట్ గ్రేడ్ సర్వీసు ఉద్యోగాల్లో నియమించారు. తాజాగా శాఖల వారీగా నియామకపత్రాలు అందించడంతో శాశ్వత ఉద్యోగులుగా విధుల్లో చేరారు.

రెవెన్యూకే అధికం..

జిల్లాలోని వీఆర్ఏలను వారి విద్యార్హతలను బట్టి మొత్తం 13 శాఖల్లో ఖాళీగా ఉన్నచోట పోస్టింగ్‌లు ఇచ్చారు. వీఆర్ఏలను రెవెన్యూ శాఖకు అత్యధికంగా కేటాయించారు. జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ అటెండర్, చైన్‌మెన్, వాచ్‌మెన్‌లుగా మొత్తం 157 మందిని సర్దుబాటు చేశారు.


తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా విధుల్లో చేరిన గత వీఆర్ఏలు

నీటిపారుదల శాఖలో 44 మందిని లష్కర్‌లుగా, పురపాలకశాఖలో వివిధ క్యాడర్లలో 24 మందిని, ఇంటర్ విద్యలో 17 మందిని, మిషన్ భగీరథలో సహాయకులుగా 14 మందిని, వ్యవసాయ పశుసంవర్థక శాఖ, ఉన్నత విద్య, పాఠశాల విద్యలో ఐదుగురు చొప్పున, సహకారం సంఘంలో నలుగురిని, వైద్య కళాశాలలో ఇద్దరిని, గిరిజన సంక్షేమ, మహిళ శిశు సంక్షేమ శాఖల్లో ఒక్కొక్కరిని నియమించారు.

కారుణ్యానికి కసరత్తు


చనిపోయిన, 61 ఏళ్లు దాటిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించగా, ఆ ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు.

వీఆర్ఏల సర్దుబాటు ఇలా..

కేటగిరీ	సంఖ్య
రికార్డు అసిస్టెంట్	73
ఆఫీసు సబార్డినేట్లు (అటెండర్లు)	66
జూనియర్ అసిస్టెంట్లు	50
లష్కర్లు	44
వార్డ్ ఆఫీసర్లు	24
హెల్పర్లు	14
చైన్‌మెన్లు	10
వాచ్‌మెన్లు	03

జిల్లాలో ఇంకా 58 మందికి పోస్టింగులు కేటాయించలేదు. వారసుల్లో ఎవరికి ఉద్యోగావకాశం ఇవ్వాలో తేల్చుకోలేక కొందరు, వివాదాలతో మరికొందరు వివరాలను అధికారులకు సకాలంలో నివేదించకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కారుణ్య నియామక పద్ధతిలో ఈ ఏడాది జూలై 31 వరకు వీఆర్ఏల వయసును పరిగణనలోకి తీసుకున్నారు. వారసులకు కేటాయింపుల ప్రక్రియ పూర్తి కావడానికి మరికొన్ని రోజుల సమయం పట్టే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.


జూనియర్ అసిస్టెంట్‌గా చేరా..



నేను కొన్నేళ్లుగా రెవెన్యూ శాఖలో వీఆర్ఏగా విధులు నిర్వహించాను. రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను క్రమబద్ధీకరించడంతో ఏళ్ల నాటి కల నెరవేరింది. ప్రస్తుతం కౌటాల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరాను. ప్రభుత్వ నిర్ణయంతో వీఆర్ఏలకు ఎంతో మేలు జరిగింది.

\- జాడి విఠల్, జూనియర్ అసిస్టెంట్, కౌటాల

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలని గతేడాది ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాం. దీంతో ప్రభుత్వం స్పందించింది. వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. కౌటాల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరాను.

\- కామ్రె నారాయణ, జూనియర్ అసిస్టెంట్, కౌటాల

కలెక్టరేట్‌లో ఆకట్టుకున్న స్టాల్స్


నీటిని శుద్ధి చేసే విధానం వివరిస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సమీకృత కలెక్టరేట్‌లో ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ చూపరులను ఆకట్టుకున్నాయి. తక్కువ ఖర్చుతో అడవిలో లభించే చిల్లి గింజలతో మురుగునీటిని శుద్ధజలంగా మార్చే విధానం గురించి విద్యార్థులు ప్రభుత్వ విప్ సుంకరి రాజు, కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వివరించారు. రెండు గంటల పాటు కుండలో ఈ గింజలు ఉంచి నీరు పరిశుభ్రంగా మారుతుందని వారు తెలిపారు. బెజ్జూర్ మండలం కుంటలమానెపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మద్యం తాగి బైక్ నడపకుండా ఉపయోగపడే హెల్మెట్‌ను ప్రదర్శించారు. శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్స్, ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ పనిముట్ల స్టాల్స్, బీసీ వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో 30 రకాల వెదురు బొమ్మలు, మట్టి పాత్రలు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తేనె, మిల్లెట్స్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

‘ఎమ్మెల్యే టికెట్‌పై హామీ’


వైఎస్ షర్మిలతో గోవింద్ నాయక్ బూక్య

ఆసిఫాబాద్‌అర్బన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీ నుంచి ఆసిఫాబాద్ (ఎస్టీ) రిజర్వుడ్ స్థానంలో పోటీ చేయనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ బూక్య తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వైఎస్సార్‌టీపీ వ్యవస్థాపకురాలు వైఎస్ షర్మిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీతో పొత్తు ఉన్నా ఆసిఫాబాద్ నియోజకవర్గం టికెట్ తనకే కేటాయిస్తానని షర్మిల హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.